సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



ప్రసవాలకు.. కేరాఫ్ ప్రభుత్వాస్పత్రులు - IIలో

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవానికి గర్భిణులు మొగ్గుచూపుతున్నారు.



15 నుంచి చేపలవేట నిషేధం - IIలో

మత్స్యసంపద వృద్ధిలో భాగంగా ఈ నెల 15 నుంచి వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది (సా॥)	సోమ (ఉ॥)
6.16	4.23

న్యూస్‌రీల్

ముమ్మర తనిఖీలు

- ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్‌టీ) తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నియోజకవర్గాల్లో 48 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 36 స్టాటిక్ సర్వేలయన్స్ బృందాలు, 16 వీడియో సర్వేలయన్స్ బృందాలు, నాలుగు వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రజలు 1950 టోల్‌ఫ్రీ నంబర్‌తో సహా సి-విజిల్, ఆన్‌లైన్ ఫిర్యాదుల విభాగంలో సమాచారం ఇవ్వవచ్చన్నారు. అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద నిఘా పటిష్టం చేయాలని ఆదేశించారు.

పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు

సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. రాష్ట్రాల సరిహద్దులు, జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ శోభిక, సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పీఓలు కల్పనాకుమారి, సి.విష్ణుచరణ్, డీఆర్వో జి. కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 20న ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్ష

సీతంపేట/పార్వతీపురం: ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్ష ఈ నెల 20న జరుగుతుందని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని భామిని, మెళియాపుట్టి, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతిలో మొత్తం సీట్లు, 7 నుంచి 9 తరగతుల్లో మిగులు సీట్లకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. వాస్తవానికి ఈనెల 13న ప్రవేశపరీక్ష జరగాల్సి ఉన్నప్పటికీ అనివార్యకారణాల వల్ల 20వ తేదీకి వాయిదాపడిందన్నారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ 63035 08032, గురుకులం సెల్ ఇన్‌చార్జి 94909 71090 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు



వేతనదారులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ టి.జగన్మోహనరావు

కొమరాడ: ఎండలు అధికంగా కాస్తున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పరుశురాంపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులకు శనివారం ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మజ్జిగ, గ్లూకోజు వాటర్, నిమ్మరసం, బార్లీ వంటివి ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురయ్యేటప్పుడు చర్మం పొడి బారడం, తలనొప్పి, వికారం, సహనం కోల్పోవడం జరుగుతుందన్నారు. వడదెబ్బకు గురైన వారిని వెంటనే నీడలోకి చేర్చి నీరుతాగించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇచ్చి తీవ్రతను బట్టి సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయగౌరి, క్షేత్ర సహాయకులు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి మూల్యాంకన ప్రక్రియ పరిశీలన

విజయనగరం అర్బన్: విజయనగరం సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జరుగుతున్న 10వ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన ప్రక్రియను రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ శనివారం పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియలో చేపడుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మూల్యాంకనం పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఓ ప్రేమకుమార్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ టి.సన్యాసిరాజు ఉన్నారు.

గెలుపు భరోసా

- నగర్వంగా ఇంటింటికీ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- అడుగడుగునా అపూర్వ ఆదరణ
- తిలకం దిద్ది, హారతులు పడుతున్న వైనం
- సంక్షేమ పథకాలతో ఐదేళ్లలో కలిగిన మేలును వివరిస్తున్న ప్రజలు
- ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు

సాక్షి, పార్వతీపురం మన్యం :

ఏజెన్సీ అంటేనే వైఎస్సార్‌సీపీకి కంచుకోట. 2014, 2019 ఎన్నికల్లో సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలోకి దిగిన పీడిక రాజన్నదొర, పాముల పుష్పశ్రీవాణి, విశ్వాసరాయి కళావతి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అలజంగి జోగారావు విజయ పతాకం ఎగురవేశారు. పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కొత్త ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో కొత్త జిల్లాగా అవతరించడం.. ప్రభుత్వ వ్యవస్థలన్నీ చేరువకావడం, ఏజెన్సీ ముఖద్వారమైన పార్వతీపురాన్ని జిల్లా కేంద్రంగా గుర్తించడం, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందడం, ఏజెన్సీలో సెల్ సిగ్నల్ సమస్యలు పరిష్కారం, సచివాలయాలతో సేవలు చేరువకావడంతో ప్రభుత్వంపై ప్రజల్లో సానుభూతి మరింత పెరిగింది. త్వరలో జరానున్న ఎన్నికల్లో ప్రజలంతా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు పట్టం కట్టేందుకు సంసిద్ధులుగా ఉన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి జనాదరణ

రాష్ట్రంలో మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాలకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అడుగడుగునా అపూర్వ ఆదరణ లభిస్తోంది. సంక్షేమ పథకాలు తమ జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులను మహిళలు, వృద్ధులు వివరిస్తున్నారు. ముఖమంత్రి జగన్ ఫొటో చూపించగానే.. వృద్ధుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. తమ కష్టాలు తీర్చిన దేవుడిగా ఆరాధిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసిన ఎమ్మెల్యే అభ్యర్థులకు మరింత ఉత్సాహం వస్తోంది. వాస్తవానికి ఐదేళ్ల అధికారంలో ఉన్న ఏ పార్టీపైనైనా కాస్త ప్రజావ్యతిరేకత సాధారణం. జగన్ ప్రభుత్వం ఇందుకు భిన్నం. గత ఏడాదికిపైగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు గడపగడపకు మన ప్రభుత్వం పేరిట ప్రజల మధ్యనే ఉంటున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి, వెనువెంటనే పరిష్కరించారు. ఫలితంగా గ్రామాల్లో రహదారులు, కాలువలు, మంచినీటి సమస్యలు, విద్యుత్తు దీపాలు వంటి సమస్యలే లేకుండా చేయగలిగారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారు. గతంలో ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ముఖమే కనిపించేది కాదు. మళ్లీ ఎన్నికలప్పుడే దర్శనమిచ్చేది. జగన్ ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించింది. నిత్యం వారిని ప్రజల మధ్య ఉంచింది. ఫలితంగా ప్రజలు ఎమ్మెల్యేలను తమ సొంత మనుషులుగా భావిస్తున్నారు. అందుకు నిదర్శనమే ఇప్పుడు ఇంటింటికీ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు లభిస్తున్న ఆదరణ.

ఎన్నికల ప్రచారంలో దూకుడు

ఎన్నికల ప్రచారంలో మిగతా ప్రతిపక్ష పార్టీలతో పోల్చుకుంటే వైస్సార్‌సీపీ ముందు వరుసలో ఉంది. టీడీపీ కూటమిగా జట్టు కట్టి వస్తున్నా ప్రజలు విశ్వసించడం లేదు. మీ హయాంలో ఏం చేశారంటూ నిలదీస్తున్నారు. జగన్ ప్రభుత్వంలోనే తమకు మేలు జరిగిందంటూ బహిరంగంగానే చెబుతుంటే.. కూటమి నేతలు తెల్లబోతున్నారు. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు, నాయకులకు బ్రహ్మరథం పడుతున్నారు.



వీరఘట్టం: చిట్టపులివలసలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి హారతిచ్చి ఆశీర్వదిస్తున్న మహిళ

‘విశ్వ’మంత మనసు

మంచికి మారుపేరుగా పాలకొండ నియోజకవర్గ ప్రజల్లో ఓ నమ్మకాన్ని కూడగట్టుకున్న విశ్వాసరాయి కళావతి హ్యాట్రిక్ విజయం దిశగా దూసుకుపోతున్నారు. గిరిజన ప్రజలతో మమేకమవుతూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఉదయం 8 గంటలకే ఆమె ప్రజల్లోకి వెళ్లిపోతున్నారు. వీరఘట్టం, సీతంపేట, భామిని, పాలకొండ ప్రాంతాల్లో ఇప్పటికే ఓ విడత ప్రచారం పూర్తి చేసేశారు. ఎండలు మండుతున్నా.. ప్రజలూ ఆగడం లేదు.. ఆమెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో ప్రజల వద్దకు వెళ్తున్నప్పుడు ప్రధానంగా వృద్ధుల కళ్లలో ఉద్వేగం కనిపిస్తోంది. ఆయనే మా దేవుడు అంటున్నారు. ఆయనిచ్చిన డబ్బులతోనే ఇప్పుడు కడుపారా తింటున్నామని చెబుతున్నారు. ఓ వైపు కళావతి కలివిడితనం.. మంచి వ్యక్తిత్వం.. అందరినీ పేరుపెట్టి పిలిచే చనువు ఉండడం, నిత్యం ప్రజలకు మంచిచేద్దామన్న తపన ఆమెకు ఈ సారి భారీ విజయాన్ని అందిస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



పాచిపెంట మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజన్నదొర

ప్రచారంలో ‘దొర’గా..

సాలూరు నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మండుటెండలోనూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎండ వేడిమిని సైతం లెక్క చేయకుండా స్థానికులు స్వచ్ఛందంగా ఆయన వెంట నడుస్తున్నారు. వృద్ధులు, మహిళలు ఆయనకు హారతులు పట్టి, విజయతిలకం దిద్దుతున్నారు. గత నెలలో సాలూరు మండలం శివరాంపురం, గుమ్మడంలో ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇప్పటికే సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లోని పలు ప్రాంతాల ఓటర్లను కలిశారు. ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో ఆయన ప్రచార వ్యూహాలు ఉన్నాయి.

ఇంటింటా ఆశీర్వాదం

పార్వతీపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఉదయం వేళ పార్వతీపురం పట్టణంలోని వార్డుల్లోనూ.. సాయంత్రం వేళ గ్రామాల్లోనూ పర్యటించి ప్రజలతో మమేకమవుతున్నారు. ఇప్పటికే పార్వతీపురం పట్టణం, మండలం, బలిజిపేట, సీతానగరం మండలాలను ఓ దఫా చుట్టేశారు. ఇప్పుడు మరో దఫా పర్యటనకు సిద్ధమైపోయారు. ప్రతి ఇంటికీ వెళ్లి.. ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పాలనను వివరిస్తున్నారు. ఎక్కడికక్కడ ఆయనకు స్థానికుల బ్రహ్మరథం పడుతున్నారు. గజమాలలతో సత్కరిస్తున్నారు. పల్లకీల్లో ఊరిగిస్తూ తమ గ్రామానికి తోడ్కొని వెళ్తున్నారు.



పార్వతీపురం పట్టణంలోని అగ్రహారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు విజయతిలకం దిద్ది హారతిచ్చి ఇస్తున్న మహిళ

కురుపాం ప్రజల ‘వాణి’గా..

కురుపాం నియోజకవర్గంలో ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కురుపాం మండలంలోని బియ్యాలవలస, సింగుపురం, గొందిలోవకాలనీ, గోళ్లవలస, కిచ్చాడ గ్రామాలతోపాటు, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. స్థానిక గిరిజన మహిళలతో మాట్లాడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారికి కలిగిన లబ్ధిని అడిగి తెలుసుకుంటున్నారు. మీ వెనుకే నడుస్తాం.. మిమ్మల్ని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామంటూ గిరిజనులు ఆమెకు భరోసానిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ప్రతీ సమస్యను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నేరుగా తీసుకెళ్లి పరిష్కరించగలిగే చొరవ ఆమె సొంతం. అందుకే.. కొండల్లో ఎన్నడూ కనిపించని ప్రగతి ‘మార్గాలు’ ఇప్పుడు కళ్లకు కడుతున్నాయంటే ఆమె కృషికి నిదర్శనం. ప్రతీ గ్రామానికి సంక్షేమ, అభివృద్ధి పాలన చేరువైందంటే ఆమె పాలనదక్షతే కారణం. అందరికీ అందుబాటులో ఉండడం, ప్రతి గిరిజన గూడనా పుట్టినిల్లుగా ఆమె పదేపదే చెబుతుండడం, అక్కడి గిరిజనులతో మమేకం కావడం, ప్రతీ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం.. ఆపద సమయాన అండగా నిలబడడం ఆమెను ఈ సారి విజయపతాకాన నిలబెడతాయని ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. పార్టీ శ్రేణులైతే ప్రతి ఊరు, ఇంటా గెలుపు జెండా ఎగురవేస్తున్నారు.



గుమ్మలక్ష్మీపురం మండలం తాటిశీలలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

మా ఇంటి ఆత్మబంధువు జగనన్న



మాది వీరఘట్టం మండలం కంబర గ్రామం. మాకు ఎన్నో సంక్షేమ పథకాలు జగనన్న అందించారు. మా పాపకు మూడేళ్లపాటు అమ్మఒడి ఇచ్చారు. అలాగే, నాకు మూడేళ్లుగా వైఎస్సార్ చేయూత ద్వారా 18,750లు ఇచ్చారు. అలాగే రైతు భరోసా, డ్వాక్రా రుణమాఫీ ఇటువంటి పథకాలు ఇచ్చి జగన్‌మోహన్ రెడ్డి మా ఇంటికి ఆత్మ బంధువు అయ్యారు. గతంలో ఏ నాడు ఇటువంటి సంక్షేమ పథకాలు పొందలేదు. మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే. మా లాంటి మహిళల అండదండలు జగన్‌మోహన్ రెడ్డికి ఎప్పుడూ ఉంటాయి.

– పిల్లి రాజమ్మ, కంబర గ్రామం, వీరఘట్టం మండలం

ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆర్థిక ఆనందం

- నాడు టీడీపీ హయాంలో ఆర్టీసీ సంస్థ నిర్వీర్యం
- నేడు వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వంలో విలీనం
- ఆర్టీసీ ఉద్యోగులకు మంచి రోజులు
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగ భద్రత
- జిల్లాలో 1081 కుటుంబాల్లో ఆనందం

పార్వతీపురంటౌన్:

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకముందు.. ఆర్టీసీ అంటే ఒక చిన్నచూపు ఉండేది. నిత్యం ఆర్టీసీ ఉద్యోగులు ఆవేదనలో ఉండేవారు. జీతాలు సకాలంలో అందక.. అరకొర జీతాలతో కుటుంబాలను నెట్టుకురాలేక సతమతమయ్యేవారు. కొత్తబస్సులు కొనుగోలు చేయాలన్న విజ్ఞప్తులను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకునేది కాదు. మరమ్మతులకు గురైన బస్సులనే నడిపేందుకు డ్రైవర్లు నానా పాట్లు పడేవారు. ప్రయాణికులను సరక్షితంగా చేర్చేందుకు ఆపసోపాలు పడేవారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయంతో 2020 జనివరి ఒకటో తేదీన ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యింది. ఉద్యోగులందరూ ప్రజా రవాణాశాఖ ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. దశాబ్దాల కల నెరవేరింది. అప్పటి నుంచి ఉద్యోగుల కష్టాలు తొలగిపోయాయి. నాలుగేళ్లుగా వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, బెనిఫిట్స్, అలవెన్స్‌లు ఠంచన్‌గా అందుతున్నాయి. ఈ నిర్ణయంతో పార్వతీపురం మన్యం జిల్లాలో 1081 మంది కుటుంబాల్లో సంతోషాలు నిండాయి.

జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు	
ఆర్టీసీ డిపో	ఉద్యోగుల సంఖ్య
పాలకొండ	403
పార్వతీపురం	369
సాలూరు	294
ఆఫీస్ సిబ్బంది	15
మొత్తం	1081

నాడు సమ్మెచేస్తే జీతాలు కట్

ఆర్టీసీ ఇస్తున్న వేతనాలు చాలక డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులు ఎన్నో సార్లు సమ్మెలు, పోరాటాలు చేశారు. అయినా తగిన ప్రతి ఫలం దక్కేదికాదు. గత టీడీపీ ప్రభుత్వం కార్మికులను వేధించి, సమ్మె కాలానికి జీతాలు కోసి ఉక్కుపాదం మోపింది. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు రోజులు లెక్కపెట్టుకున్నారు. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని ఆర్టీసీ ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

కరోనా కష్టకాలంలోనూ ఠంచన్‌గా జీతాలు

కరోనా సమయంలో లాక్ డౌన్ కారణంగా రెండేళ్లలో సుమారు నాలుగు నెలలకు పైగా బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ఆ పరిస్థితులు గతంలో ఎదురైతే కార్మికుల వేతనాల్లో కోతలు పడేవి. అప్పటికే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఎన్ని కష్టాలు ఉన్నా ఒకటో తేదీన ఉద్యోగులకు ఠంచన్‌గా జీతాలు అందాయి. ఇలా జీతాలు చెల్లించడం చరిత్రలో మొదటిసారి అని ఉద్యోగులు ప్రతిసారీ గుర్తుచేసుకుంటారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును తమ కుటుంబాలతో చర్చించుకుంటున్నారు.

నెరవేరనున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. హయ్యర్ పెన్షన్‌స్కీమ్ వల్ల ఉద్యోగులందరికీ లబ్ధి కలగనుంది. గతంలో కేవలం బేసిక్ రూ.15000 ఉన్న ఉద్యోగులే పెన్షన్‌కు అర్హులయ్యేవారు. ఇప్పుడు అందరికీ మేలుజరిగేలా ఆన్‌లైన్‌లోనే ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ వివరాలను అప్లోడ్ చేసే వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీనికి 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు. ఇప్పటికే ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నారు. వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.



పార్వతీపురం ఆర్టీసీ డిపో

నాడు..

అప్పుల ఊబిలో ఆర్టీసీ సంస్థ ఉండేది. కొత్త బస్సులు లేవు. ప్రభుత్వం నుంచి సాయం శూన్యం. ఆర్టీసీ ఓ కార్పొరేషన్ సంస్థగా మనుగడ. ఉద్యుగులకు జీతాలు సక్రమంగా అందేవి కావు. సమ్మె చేస్తే జీతాల్లో కోతలు. సమస్యల కోసం ఆందోళనలు చేస్తే మెమోలు. పనిభారం ఎక్కువ. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అన్న మాటే లేదు. ఆర్టీసీ సంస్థ గత పరిస్థితి ఇది.

నేడు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీను ప్రభుత్వంలో వీలీనం చేశారు. సీఎం సాహసోపేత నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లభించింది. ఉద్యోగ భరోసా కలిగింది. కొత్త బస్సులు సమకూరాయి. కారుణ్య నియామకాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఉపాధి లభించింది. ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యాయి. జీతాలు ఒక్కసారి రెట్టింపయ్యాయి. ఉద్యోగుల కుటుంబాల్లో కొత్త వెలుగు కనిపించింది. సరికొత్త విధానాలతో ఆర్టీసీ ప్రగతిపథంలో దూసుకుపోతోంది.

మా సమస్యలకు జగన్ శాశ్వత పరిష్కారం

ఆర్టీసీ కార్మికుల సమస్యలకు సీఎం జగన్ శాశ్వత పరిష్కారం చూపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆర్టీసీ విలీనం ప్రక్రియ పూర్తిచేసి మాట నిలుపుకున్నారు. కరోనాలోనూ జీతాలు బ్రేక్ లేకుండా చూశారు. కార్మికుల మేలు కోరిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి.

– ఓ ఆర్టీసీ ఉద్యోగి, (డ్రైవర్) పార్వతీపురం

ప్రభుత్వ ఉద్యోగులతో సమానం

ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్నప్పుడు అనేక ఇబ్బందుల ఎదుర్కొన్నాం. ఇప్పుడు ప్రజా రవాణా శాఖలోకి విలీనం చేయడంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, అలవెన్స్‌లు అందుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు ఠంచన్‌గా జరుగుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగుల మేలు కోరిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే. ఆయన మేలు ఎప్పటికీ మరచిపోలేనిది. మా కుటుంబాలన్నీ ఈ రోజు సంతోషంగా ఉన్నాయంటే ఆయన చలువే.

– ఓ ఆర్టీసీ ఉద్యోగి (కండక్టర్), పార్వతీపురం

కుంకుమ పూజ



సీతారాంపురంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ విజయనగరంశాఖ ఆధ్వర్యంలో శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు. పూజా సామగ్రిని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జి.చినతిరుపతిరావు మాట్లాడుతూ హిందువులంతా గోవును పూజించాలన్నారు. కార్యక్రమంలో జి.సూర్యకుమారి, జె.శ్యామ్ సుందరం, బి.సుధారాణి, త్రినాథ, లక్ష్మి, మానస, పకీరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుచ్చిమిలో మామిడి, టేకు తోటలు దగ్ధం



కాలిపోయిన టేకు మొక్కలు, మామిడి తోటలు

సీతానగరం: మండలంలోని గుచ్చిమి సమీపంలో జీడి, మామిడి, టేకు తోటల్లో శనివారం వేకువజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో 15 ఎకరాల్లో తోటలు కాలిపోయినట్టు రైతులు తెలిపారు. సీహెచ్ అప్పలనాయుడు, బి.శంకరరావులతో పాటు పలువురు రైతులకు చెందిన తోటలు కాలిపోయినట్టు తెలిపారు. గుచ్చిమి రెవెన్యూ పరిధిలో తాన్న సీతారాంపురం – గుచ్చిమి గ్రామాల మధ్య బీటీ రోడ్డుకు ఆనుకుని ఉన్న 25 మంది రైతుల తోటలు కాలిపోయినట్టు గుర్తించారు. వ్యవసాయాధికారులు స్పందించి తోటల్లో జరిగిన నష్టాన్ని జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



బిక్రమాదిత్య

పార్వతీపురం టౌన్: ఒడిశా రాష్ట్ర బందుగామ్ గ్రామానికి చెందిన బిక్రమాదిత్య అలియాస్ గొల్లబాబు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేసినట్టు సీఐ కృష్ణారావు శనివారం తెలిపారు. గొల్లబాబు ఆరోగ్యం బాగా లేకపోవడంతో పార్వతీపురం పట్టణంలోని కర్షక మహర్షి ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చికిత్స కోసం చేర్చారు. ఈ నెల 3న రాత్రి 8 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బిక్రమాదిత్య ఆచూకీ తెలిస్తే పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బొండపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో జాతీయ రహదారి 26పై శనివారం మధ్యాహ్నం కారును వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి కారును ఢీకొంది. దీంతో బైక్‌పై ప్రయాణం చేస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు గజపతినగరం మండలం లింగాలవలస గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

104 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ, తదితరులు

బొబ్బిలి: సర్కిల్ పరిధిలోని బాడంగి మండలం గొల్లాదికి చెందిన మోర్చ ఆనందరావు మోటారు సైకిల్‌పై 104 మద్యం సీసాలను తరలిస్తుండగా కాపు కాచి అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ బీవీ మురళీధర్ తెలిపారు. అతని నుంచి మద్యం సీసాలను, మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఆనందరావును రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, హెచ్‌సీ బి.మాధవీ దేవి పాల్గొన్నట్టు చెప్పారు.

యువతి ఆత్మహత్య



పోలమ్మ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని దండిగా గ్రామానికి చెందిన చెడ్డ పోలమ్మ (19) ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ బాలకృష్ణ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... దండిగాం గ్రామానికి చెందిన చెడ్డ పోలమ్మ ఏ పనీ లేకుండా ఇంటి దగ్గర ఉంటుందని తల్లిదండ్రులు మందలించడంతో సుమారు 25 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని పెద్దగా పట్టించుకోలేదు. శనివారం గ్రామానికి చెందిన వ్యక్తి గ్రామ సమీపంలో ఉన్న కొండపైకి వెళ్లి చూడగా పోలమ్మ మృతదేహం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెళ్లి చూడగా సుమారు మూడు వారాల కిందట చనిపోయి ఉంటుందని భావిస్తున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

ప్రసవాలకు..
కేరాఫ్ ప్రభుత్వాస్పత్రులు

- శతశాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే..
- లక్ష్యానికి మించి ముందుకు...



ఘోషాస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న మహిళలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవానికి ఆసక్తి చూపుతున్నారు. గతానికి భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రులంటే సుఖ ప్రసవానికి కేరాఫ్ చిరునామాగా నిలుస్తున్నాయని పేర్కొంటున్నారు. 2019కు ముందు జిల్లాలో చాలా వరకు ఇంటి వద్ద ప్రసవాలు (హోం డెలవరీ) జరిగేవి. ఇంటి ప్రసవాలు వల్ల మాత, శిశు మరణాలు సంభవించేవి. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటి ప్రసవాలకు పూర్తిగా చెక్ పెట్టింది. మాత, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఆస్పత్రుల్లో ప్రతి గర్భిణి ప్రసవం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఆస్పత్రుల్లో సకల సౌకర్యాలు..

జిల్లాలో ఉన్న అన్ని ఆస్పత్రుల్లోను ప్రసవాలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు ప్రసవాలు నిర్వాహణకు అవసరమైన వసతులను కల్పించింది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో కాన్పు గదులను, ఆపరేషన్ థియేటర్స్‌ను ఆధునీకరించి, అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసింది. దీని వల్ల పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లోను ప్రసవాలు జరుగుతున్నాయి. ఆస్పత్రుల్లో సౌకర్యాలు ఉండడం వల్ల గర్భిణులు ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిపించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ప్రసవం జరిపిస్తున్నారు. ఆరోగ్య ఆసరా క్రింద వీరికి రూ.5 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తున్నారు. దీని వల్ల ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి.

జిల్లాలో ఇలా..

ప్రసవాలు నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రులు జిల్లాలో 57 ఉన్నాయి. వాటిలో 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), 5సామాజిక ఆరోగ్య కేంద్రాలు(సీహెచ్‌సీ), మూడు ప్రాంతీయ ఆస్పత్రులు (ఏరియా ఆస్పత్రులు)తో పాటు ఘోషాస్పత్రి ఒకటి ఉంది. ప్రైవేటు ఆస్పత్రులు 70 వరకు ఉన్నాయి.

శతశాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే..

ప్రసవాలు శతశాతం ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. గర్భిణులు అందరూ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిపించుకునే విధంగా వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2022 – 23 సంవత్సరంలో 22,201 ప్రసవాలు లక్ష్యం కాగా 22,200 ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగాయి. అదేవిధంగా 2023 – 24లో ప్రసవాల లక్ష్యం 19,402 కిగాను, 19,400 ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగాయి. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. గర్భిణులకు అవసరమైన వైద్య తనిఖీలు సకాలంలో చేయిస్తున్నారు. గర్భిణులను ప్రసవ తేదీకి రెండు, మూడు రోజులు ముందు ఆస్పత్రుల్లో చేర్పించి ప్రసవం జరిపిస్తున్నారు. హైరిస్క్ గర్భిణులను వారం రోజులు ముందు చేర్పిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలింత పేరు కె.కామయ్యమ్మ. ఈమెది మెంటాడ మండలం జక్కువ గ్రామం. పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఘోషాస్పత్రిలో చేర్పించారు. ఆమెకు ఘోషాస్పత్రి వైద్యులు సుఖ ప్రసవం జరిపించారు. డిశ్చార్జ్ అనంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా ఇంటికి పంపించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు జె.రమణి. ఈమెది బొండపల్లి మండలం గిట్టుబిల్లి గ్రామం. పురిటి నొప్పులు రావడంతో కొద్ది రోజులు క్రితం కుటుంబ సభ్యులు ఘోషాస్పత్రిలో చేర్పించారు. వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. సాధ్యం కాక పోవడంతో సిజేరియన్ చేశారు. ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఎంతో ప్రేమగా వైద్యులు తనకు ప్రసవం జరిపించారని ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

నాడు కక్ష సాధింపు..
నేడు బుజ్జగింపు

- గతంలో టీడీపీ నేతలపై కక్ష సాధించిన టీడీపీ ఇన్‌చార్జ్ కోండ్రు
- ఇప్పుడు అదే పార్టీలో చక్రం తిప్పే ప్రయత్నాలు
- మానసిక క్షోభలో తెలుగు తమ్ముళ్లు
- పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి అడుగులు
- ఓటమి సంకేతాలతో భయపడుతున్న కోండ్రు
- వలసలు అడ్డుకునేందుకు కొత్త ఎత్తుగడ
- సొంత పార్టీకి చెందిన వారికే కండువాలు వేసి పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం



రాజాం మండలం కంచరాంలో టీడీపీ నేతలకే మళ్లీ ఇలా కండువాలు వేసి ప్రచారం

రాజాం: తెలుగుదేశం పార్టీలో ముసలం కనిపిస్తుంది. కూటమి ఒప్పందంలో భాగంగా టీడీపీ రాజాం టిక్కెట్‌ను తీసుకుని కోండ్రు మురళీమోహన్‌కు అప్పగించింది. 2009 –14 మధ్య కాలంలో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ తరపున కోండ్రు మురళీమోహన్ పోటీచేసి టీడీపీ నుంచి పోటీ చేసిన కావలి ప్రతిభాభారతిపై గెలుపొందారు. అనంతరం ప్రభుత్వ విప్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో రాజాంలో టీడీపీ టీంను టార్గెట్ చేసుకున్నారు. మండల స్థాయి టీడీపీ నేతల నుంచి గ్రామ స్థాయి టీడీపీ కార్యకర్తపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారు. మంత్రి పదవిని అడ్డు పెట్టుకుని టీడీపీ కార్యకర్తలు, ప్రధాన నేతలకు సంబంధించిన చాలా పనులను అడ్డుకున్నారు. అందులో రాజాంకు చెందిన టీడీపీ ప్రధాన నేతలతో పాటు సంతకవిటి మండలానికి చెందిన కొల్ల అప్పలనాయుడు, రేగిడి మండలానికి చెందిన కిమిడి రామకృష్ణంనాయుడు తదితరులు ఉన్నారు. ఇప్పుడు అదే టీడీపీలో చేరి అధికారం కోసం కుస్తీ పడుతున్నారు. కక్ష సాధించిన టీడీపీ కార్యకర్తలనే పట్టుకుని స్థానిక ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే గతంలో కోండ్రు చేసిన అరాచకాలు గుర్తుకు వచ్చి టీడీపీ కార్యకర్తలు, ప్రధాన నేతలు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. కోండ్రుకు సహకరించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇదే అదునుగా మండల నేతలను పక్కన పెట్టి నేరుగా గ్రామ స్థాయి కార్యకర్తలతో బేరసారాలకు దిగారు కోండ్రు. ఇది ఆ పార్టీలో మండల స్థాయి లీడర్‌లకు దడ పుట్టిస్తుంది. ఎమ్మెల్యేగా గెలవక ముందే కోండ్రు అధికార దాహం చూసి టీడీపీ నేతలు ఆందోళనకు గురవుతున్నారు.

అడ్డదారి ప్రచారాలు

మండల స్థాయిలో సరైన నాయకులు కోండ్రుకు సహకరించే పరిస్థితి రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో కనిపించడం లేదు. పార్టీలోకి వచ్చిన వారిని పక్కన పెడితే పార్టీ నుంచి చేజారిపోతున్న వారి సంఖ్య రాజాం నియోజకవర్గంలో రోజు రోజుకు పెరుగుతుంది. జనసేన పార్టీ ఇన్‌చార్జి ఎన్ని రాజుకు గౌరవం ఇవ్వలేదని ఆయన ప్రెస్ మీట్ పెట్టి టీడీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేస్తామని హెచ్చరించారు. మరో వైపు రాజాం పట్టణంలో ప్రధానంగా తనకు పట్టు ఉందని చెప్పుకొచ్చిన హరిజనవీధి, మెంతిపేట ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్, కొండంపేట, బుచ్చింపేట, మారుతీనగర్ ప్రాంతాల నుంచి ఇటీవల వందల సంఖ్యలో టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరే కాకుండా రాజాం మండలంలో ఆగూరు, గుయ్యానవలస, గార్రాజుచీపురుపల్లి, శ్యాంపురం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నుంచి వీడుతున్న వారిని కట్టడి చేసేందుకు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వస్తున్నట్లు ప్రచారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆ ప్రచారం అభూత కల్పనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఆ చేరికలు నవ్వుల పాలవుతున్నాయి.



కోండ్రు మురళీమోహన్

అంతా బూటకమే..

నెల రోజులు క్రితం రాజాం మండలం అంతకాపల్లి నుంచి టీడీపీలోకి పలువురి చేరినట్లు ప్రచారం చేశారు. వాస్తవానికి అక్కడ చేరికలు జరగకపోగా, ఆ పంచాయతీలో 30 శాతం కూడా ఉండని టీడీపీ కార్యకర్తలకే కండువాలు వేసి ప్రచారం చేసినట్లు ఆ మరుసటి రోజే తేటతెల్లమైంది.

- వారం రోజులు క్రితం రాజాం మండలం కంచరాం నుంచి మాజీ జెడ్పీటీసీలు టంకాల పాపినాయుడు, రౌతు రామినాయుడులు టీడీపీలో చేరినట్లు అట్టహాసం చేశారు. వాస్తవంగా ఇందులో టంకాల పాపినాయుడు 2019 సార్వత్రిక ఎన్నికల ముందే టీడీపీలో చేరారు. రౌతు రామినాయుడు పూర్తిగా టీడీపీకి చెందిన మాజీ జెడ్పీటీసీ. వీరి ప్రభావం ఆగ్రామంలో గత ఎన్నికల్లో కూడా లేదు.
- నాలుగురోజులు క్రితం సంతకవిటి మండలం మండాకురిటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బత్తుల సాంబశివరావు 2021 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీలోకి తన వర్గంతో వచ్చారు. తన కుటుంబానికి చెందిన బత్తుల కుమారికి ఎంపీటీసీ ఇప్పించారు. ఇప్పుడు ఈ వర్గం టీడీపీలోకి మళ్లీ చేరింది. వీరివలన ఎటువంటి నష్టం ఆ గ్రామంలో వైఎస్సార్‌సీపీకి లేదు. 2019లో వీరంతా టీడీపీకి చెందినవారే.
- వంగర, రేగిడి మండలాల్లోని టీడీపీ కార్యకర్తలు ఈ మధ్య వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. వీటిని అడ్డుకునేందుకు శ్యాంపురంలో తన గెస్ట్ హౌస్ వద్ద ఈ మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్నట్లు ప్రచారం చేశారు. ఇందులో వాస్తవాలు లేవని తెలిసిన మిగిలిన టీడీపీ తమ్ముళ్లు తాము వేగంగా పార్టీ మారి వైఎస్సార్ సీపీలోకి వచ్చేందుకు తమ దారి చూసుకుంటున్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం



నిర్మలాకుమారి

పూసపాటిరేగ: సముద్రంలో ఈ నెల 15 నుంచి జూన్ నెల 14 వరకు 61 రోజుల పాటు చేపల వేట నిషేధిస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు మత్స్య శాఖ డీడీఎస్. నిర్మలా కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాలలో చేపల వేట చేసే యాంత్రిక పడవల (మెక్‌నైజ్‌డు మరియు మోటారుబోటులు)లో అన్ని రకాలు చేపలు వేటను నిషేధించినట్లు తెలిపారు. సముద్ర జలాలలో వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు మరియు రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతిని ప్రోత్సహించడం ద్వారా సుస్థిరతను సాదించవచ్చునని పేర్కొన్నారు. నిషేధ ఉత్తర్వులు అనుసరించి సముద్ర జలాలలో యాంత్రిక పడవలపై మత్స్యకారులు ఎటువంటి వేట చేయకుండా మత్స్యశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘించి వేట చేసిన బోట్లు రిజిస్ట్రేషన్లు రద్దు చేయడంతో పాటు బోటు యజమానులపై ఆంధ్రప్రదేశ్ మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని అనుసరించి చర్యలు ఉంటాయని తెలిపారు. అట్టి బోట్లును మత్స్య సంపదతో పాటు బోట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు రద్దు చేస్తామని పేర్కొన్నారు.

క్వారీ తవ్వకాలను పరిశీలించిన అధికారులు

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట గ్రామ సమీపంలో ఉన్న పలు క్వారీలను జిల్లా గనులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శనివారం పరిశీలించారు. రామచంద్రపేట, కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు వచ్చి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. క్వారీల నిర్వాహణ వలన తమ గృహాలు బీట్లు పడుతున్నాయని, తాగు నీరు సైతం కలుషితమై గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడుతున్నామంటూ గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్న క్వారీలు చాలక కొత్తగా వస్తున్న క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దంటూ నినాదాలు చేశారు. కొత్త క్వారీలకు అనుమతులు ఇస్తే ఉపేక్షించేది లేదంటూ గ్రామస్తులు అధికారుల వద్ద తేల్చి చెప్పారు. తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యలను కించపరచడం చంద్రబాబుకు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

విజయనగరం: కిరాణా వ్యాపారులను, ఆర్యవైశ్యలను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కించపరచడం బాధాకరమని రిటైర్డు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు రమేష్, ఒబ్బిలిశెట్టి సునీల్ పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడు రోజుల క్రితం రావులపాలెం బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారని అనడం తీవ్రంగా తమను కలిచి వేసిందన్నారు. తక్షణమే తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మరిగుంట శ్రీనివాసరావు, పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బొడ్డు పండు, చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ మలిశెట్టి మల్లికార్జునరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు ఒబ్బిలిశెట్టి వెంకటరమణమూర్తి(రాంజీ) తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సంతకవిటి: మండల పరిధిలోని తమరాం గ్రామం వద్ద నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. తమరాం వీఆర్‌ఓ షేక్ ఖరీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

17 మందిపై కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మిమ్స్ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఉద్యోగులు గత కొన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా యాజమాన్యానికి అనుకూలంగా ఉన్న సిబ్బంది ఇళ్లను శుక్రవారం ముట్టడించారు. జరజాపుపేటలో హెచ్ఆర్ ఇంటితో పాటు మరో ఉద్యోగి ఇంటిని, అలాగే వైఎస్సార్ నగర్‌కు చెందిన ఉద్యోగిని నిర్బంధించారు. దీనిపై మిమ్స్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విజయనగరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో 12 మందిపై, నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో 5 గురిపై కేసు నమోదు చేసి శనివారం వారిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

డెంకాడ: మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పెదతాడివాడ జంక్షన్ వద్ద మోటారు సైకిల్‌పై మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. అలాగే కె.ముంగినాపల్లి శివారు ప్రాంతంలో మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 44 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రూ.9 లక్షల నగదు స్వాధీనం

డెంకాడ: మండలంలోని మోదవలస పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక కారు నుంచి సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.9 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డెంకాడ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం – విశాఖ జాతీయ రహదారిపై మోదవలస సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి విశాఖ నుంచి విజయనగరం వైపు వస్తున్న కారును ఆపి ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ ఖాన్, కానిస్టేబుల్ పైడిరాజులు మధ్యవర్తులైన అధికారుల సమక్షంలో తనిఖీ చేశారు. కారులో రూ.9 లక్షలు లభ్యమయ్యాయి. వీటికి సంబంధించి సరైన పత్రాలు చూపించకపోవడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనురించి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాయి సోమనాథ్ పాడి తదితరులు ఈ నగదును వ్యాపార అవసరాల నిమిత్తం తరలిస్తున్నట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు బెట్టింగ్ రాయుళ్లు అరెస్టు

రాజాం సిటీ: పట్టణ పరిధి తెలగవీధి, పుచ్చలవీధికి చెందిన ఇద్దరు బెట్టింగ్ రాయుళ్లను శనివారం అరెస్టు చేశామని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు తెలిపారు. ఐపీఎల్ సీజన్ కావడంతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని అన్నారు. వీరి నుంచి రూ.18,500లు నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు, బెట్టింగ్‌కు ఉపయోగించే పుస్తకాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. బెట్టింగ్‌లపై నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

200 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తూ పట్టుబడిన రాజస్తాన్ వ్యక్తులతో ఎస్.కోట పోలీసులు

శృంగవరపుకోట: అరకు – విశాఖ మార్గంలో అక్రమంగా తరలుతున్న గంజాయిని ఎస్.కోట పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్.కోట ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం ఎస్.కోట పట్టణ శివారులో పందిరప్పన్న జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.ఐ గంగరాజు బృందం అరకు నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి సోదా చేశారు. సదరు వాహనంలో ముగ్గురు వ్యక్తుల వద్ద 200 కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కైలాస్ చంద్ బలాయ్, మహవీర్‌కుమార్ జాట్, శివలాల్ జాట్‌లుగా గుర్తించారు. వీరి ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.